అనాథ బాలిక

తోలేటి పేర్రాజు గారు

౧

మురళీధరుడు గొప్ప సంఘసంస్కర్తయని ఒప్పుకొనక తప్పదు. అతనితో పరిచయమున్న వాళ్లంతా "మురళీధరుడు చాలా ఉదార స్వభావుడు, దయాపరిపూర్ణ హృదయుడు" అనేవారు. మురళీధరుడు కుశాగ్రబుద్ధి గలవాడు గనుక బాల్యంలోనే యం. బీ., సి. యం. క్లాసు చదువుచున్నాడు చెన్నపట్నంలో.

సాయంకాలం అయిదు గంటలైంది. మురళీధరుడు తెల్లని ఖద్దరు ధరించి భారతీ మాసపత్రిక చూస్తూ కూర్చున్నాడు పడక కుర్చీలో. అంత పన్నెండుసంవత్సరముల బాలుడొకడు పరుగుపరుగున వచ్చి "మురళీధరులు మీరేనా" అంటూ ఒకఉత్తరమిచ్చిపోయాడు.

ఆలేఖ పఠించుచుండగనే మోము వికాసం వాడి వెలవెల పోదొడగింది. నీరవుడై, నిశ్చితుడై "ఉశ్శ్" అని ఒక పెద్దనిట్టూర్పు విడిచాడు పాపం మురళీధరుడు. అప్రయత్నంగా బొటబొటమని కన్నీరు పిల్లకాలవలు ప్రవహించడం మొదలుపెట్టింది. భగవాను డగు భానుడు చూడలేకకాబోలును పశ్చిమాంబుధి క్రుంగిపోయాడు.

"పరాత్పరా! అప్రతిహతమాయా ప్రభావా! నీమాయ తెలుగ నేరితరము! ఆ అనాథ బాలికను ఇంక ఎట్టిఎట్టికష్టములు పెట్టనెంచితివో కదా!" అంటూ మళ్లా ఉత్తరం చదవడం మొదలుపెట్టాడు మురళీధరుడు.

"నవమాసములు మోసి నినుకన్న పదియవదినముననే అపారకృపావతి యగు మీ తల్లి పరమపదం బలంకరించుటచేతను, నీవు తదుపరి మాయింటనే పెంపబడుటచేతను, రక్తస్పర్శ కలియుటచేతను, ఇరువురము ఒక్క వక్షస్థలమున క్షీరము గ్రోలుటచేతను విచారము మానుదమన్నను పొంగి పొరలివచ్చుచున్నదే. ఆడిన ఒక్కచోట, కుడిచిననొక్క పాత్రలో, శయనించిన నొక్కశయ్యగదా! కఠినుడై నీజనకుడు నిన్ను తీసుకొనిపోవుతరి నే పొందిన విషాద మపారముకదా! నీ కొరకై అహర్నిశము పరితపించుచు, పలవించుచు నేనొక మాసమువరకు పొందినవిచారము తలచుకొన్న ఇప్పటికిని గుండె నీరైపోవుచున్నదే! ప్రత్యక్షమందు కాకపోయినను పరోక్షమందైనను, ఎచటనో ఒకచోట సుఖులై యున్నారని విని సంతసించి యూరకొంటిమి. గోరుచుట్టుమీద రోకటిపోటన్నట్లు, మాయదైవమా, ఆమె కెట్టికష్టము తెచ్చిపెట్టితివోయి!" అంటూ కుర్చీలోంచి లేచాడు మురళీధరుడు. తారకాకాంతలు అంబరమునుండి వాని కష్టములు

కొంచి బాష్పభరితలోచన లైరా యనునట్లు బొటబొటమని చినుకులు పడ్డం ప్రారంభించాయి.

అంత మురళీధరుడు తనసైకిలెక్కి సముద్రతీరాన్నుంచి పూర్వసువాసినీగృహం దాటి మైలాపురం చేరుకొన్నాడు. అచ్చట నాలుగు వీధులు పరికించేటప్పటికి "పి.టి. స్టోర్సు, జేష్టిస్టు మిష" నని కనపడింది. తిన్నగా లోపలి కెళ్లాడు మురళీధరుడు. ఒకవైపున చిన్న కుటీర మొక టుంది. అందులో "ఉ, ఉ, ఉ" అని మూల్గు వినబడుతోంది. నోట మాట లేదు. మురళీధరునకు ఏదో గొప్పతప్పు చేసినట్టు గుండెలు దడదడ కొట్టుకోడం మొదలు పెట్టాయి. ఎట్లాగైతే ఏం, గుండె నిబ్బరం చేసుకొని తలుపు తట్టాడు మురళీధరుడు. అంత "ఎవరు వా" రని గద్గదస్వరంతో అంటూ "గభ్భున" గడియ తీసారు.

తోడనే లోన ప్రవేశించాడు మురళీధరుడు. కట్టెదుట మంచముమీద మూల్గుచున్న వ్యక్తివంక తనదృష్టి సారించి నిశ్చేష్టితుడై విగ్రహంలా నిలబడిపోయాడు పాపం మురళీధరుడు. అంత పన్నెండువత్సరముల బాల నివురుకప్పిన నిప్పులాలె జీర్ణవస్త్రధారియై తలుపు వెనుకనుంచి నిమేషకాలము ఆ పాదమస్తకము పరికించి "బావా! వచ్చితివా" అని పెద్దపెట్టున ఏడ్చుచు వచ్చి కౌగలించుకొనెను. మురళీధరుడు ఆమెను వారించ ప్రయత్నంచేసాడు కాని విచారం తనకే పొంగి పొరలి వచ్చేసింది. తన జేబురుమాలుతో ఆమె కళ్లనీళ్లు తుడుస్తూ "అమ్మడు! ఎందుకే ఏడ్పు? జబ్బన్నది మనుష్యులకురాక మానులకొస్తుందా వెర్రిదానా! మనమీదేం పగవాడా, రేపోఎల్లుండో నాన్నకు కాస్త నింపాదిగా ఉంటుంది. మరి ఊరుకో" అంటూ మంచం సమీపాన కెళ్లాడు మురళీధరుడు.

"ఉ-ఉ-ఉ-" అన్న మూలుక్కి పరిమితి లేదు. ఆయాసం అధికంగా ఉంది. నోటినుండి నురగనురగల్లా వచ్చేకఫానికి విసుగు విరామం లేదు. మురళీధరుడు మెల్లగా మంచం పట్టీమీద కూర్చొని "మామ, మామ, మామ," అని ముమ్మారు మెల్లిగా పిల్చాడు. పాపం మాట్లాడలేక కాబోలును "ఊ" అని ఒక పెద్ద నిట్టూర్పు విడుస్తూ కనులువిచ్చి మురళీధరునివైపు చూస్తూ బొటబొటమని కన్నీరు విడిచాడు. మురళీధరునకు ఆవ్యక్తి జీవించునని ఆశలేదు. తన కొంగుతో కన్నీళ్లు తుడుస్తూ విచారించవలదని చేసన్న చేశాడు.

అంత రాధ వెక్కి-వెక్కి ఏడవడం మొదలుపెట్టింది. "రాధారాధా, ఎందుకే ఏడ్పు? మామమనస్సు కలత చెందుతుంది—చూడు నాన్న మాట్లాడలేక ఊరుకోమని చేసన్న చేస్తున్నాడు" అంటూ దగ్గరకు తీసుకొని కన్నీళ్లు తుడిచాడు మురళీధరుడు.

"ము-ర-ళీ-ధ-రా, హు-హు- మురళీ-ధరా-హా- నేను మిక్కిలి పాపాత్ముడనోయి. మతద్రోహిని-దేశ-ద్రోహినోయి; నా మొఖం చూస్తే ఆరోజు-నాకు- దుర్దిన మొటు—" అన్నాడు ఆవ్యక్తి.

"మామ! ఇప్పుడు అనవసరంగా మనస్సు కలత పెట్టుకోకండి. చూరునుంచి నీళ్లు కారు తాంటాయి. అదివర్ష పునీళ్లుగాని చూర్కిళ్లా?

'రాధారాధా, ఎందుకే......ఊరుకో'మని చేసన్న చేస్తున్నాడు'

మామా! అంతా దైవయత్న మండి. తప్పు చెయ్యడం, చూశారు, మానవ లక్షణం. అది తెలుసుకొని పశ్చాత్తాపపడ్డం మహాత్ముల లక్షణం" అన్నాడు మురళీధరుడు.

"మురళీధర! ఒక గొప్పరహస్యాన్ని వెలిపుచ్చేటందుకు రావించానోయి! మీ అత్త రాధను కన్న పదియవదినమున నే ప్రసూతిచే మరణించినదోయి! అంత నీలోకము అంధకారముగ కాన్పించినదోయి, మురళీధరా! కామాంధుడనై మతభ్రష్టుడ నైతినోయి. మీ అత్త అవసానకాలమందు పసికూనయగు రాధను చూపుచు 'జాగ్రత్త, జాగ్రత్త,' అని ముమ్మారు చెప్పినది. మురళీధరా! నే నొంటిగానున్న సమయమున పిలిచి కంటనీరు గ్రుక్కుకొనుచు 'నే జీవించను. రాధ దైవవశంబున బ్రతికి బట్ట కట్టినయెడల నాముద్దుమురళీధరున కిచ్చి వివాహం చేయవలయును. అదియే నాకడసారి కోరిక' అనెను. నే సమ్మతించినను 'నా కభయ మియ్య్య' మని తనచేతిలో చేయివేయించుకొని మరీ మరణించినదోయి! చెప్పిన నమ్మెదువో లేదోకాని, మురళీధరా! మీ అత్తగారి పదియవరోజున పిండములు కాకులు ముట్టినవికావు. అంత మీ అమ్మొచ్చి 'ఒదినా మీరు సంశయము పెట్టుకోవద్దు. రాధను మా మురళికి చేసుకొంటాము' అనేటప్పటికి ఎక్కడనుం చొచ్చాయో, ఒక కణమైన లేకుండా తినేశాయోయి. మాయీకోర్కె నెరవేర్చవలసిందని నా ప్రార్థన. అయ్యో! మురళీధర, అందుకస ఇంకా నాప్రాణము లున్నవోయి! ఇంకా రాధకు మత మివ్వలేదు. హాతానికైన పళ్లు, పాలు తిని ఉంటోంది. కాబట్టి ప్రాయశ్చిత్తం చేయించి హిందూమతంలోకి తీసుకోవలసిందని నాకోరిక!!"

అంత ఆయాసము హెచ్చుగాదొడంగె. రాధ "నాన్నా" అని హోరున యేడువదొడంగె. "రాధా! విచారించకు" మనుచు మురళీధరుడు తనఒడిలో కూర్చొన బెట్టుకొని కన్నీళ్లు తుడుస్తున్నాడు.

"మురళీధరా! నే ధన్యుడనోయి; బ్రాహ్మణోత్తములు స్వస్తివాచకములు చదువ, అగ్నిసాక్షిగ నీకాళ్లు కడిగి, ఆజలంబు శిరంబున

జల్లుకొని రాధను నాచేతులార నీఒడియందు కూర్చొనబెట్టు భాగ్యము లభించకపోయినను, నాఅవసానకాలమున రాధ విచారించుచుండ నీ ఒడిలో కూర్చున బెట్టుకొని ఊరడించుట కాంచితినోయి! ఇదియే నాకు పదివేలు. నే నిక నిష్కాముడనై నిశ్చింతతో మరణించెద నోయి! ఇట్టిసంతసము కాంచిన యీకన్నులతో యిక నే నేమియు చూడలేనోయి." అని కళ్లు మూసుకొనెను. "మురళీధర-మురళీ-ధర ము-ర-ళీ-ధర-కృ-ష్ణా-కృష్ణా-కృ." అని శ్వాస విడిచె.

అట్టితరి రాధ విచారము వర్ణించుట కంటె చదువరులు ఊహించుట ఉత్తమము. మరుసటిఉదయమున క్రైస్తవమతాచారవిధిని తీసుకొనిపోయిరి. రాధ మురళీధరుని వెంబడించ ప్రయత్నించెను గాని దొరగారు పోనియ్యలేదు. మురళీధరుడు పీడలేక వీడలేక గృహోన్ముఖుడాయె.

౨

అది వైశాఖమాసము. ఆ చెవి గాడ్పులు ఈచెవికి కొడుతున్నాయి. కాకులు నీడపట్టున చేరి "కావు, కావు" అని అరుస్తున్నాయి. ఎక్కడా వీథిలో జనసంచారం లేదు. అట్టిసమయంలో సన్నిధివీధి 56 నెంబరు గృహంలోకి పన్నెండేళ్ల బాల చెమటలు కక్కుచు, ఒగరుస్తు వచ్చింది. ఆ అరుగుమీద సేద తీర్చుకొనిసౌధోపరిభాగాని కెళ్లింది. అదవిశాలమైన హాలు. అందులో మురళీధరుడు 'యంగిండియా' అనే వార్తాపత్రికను చేతిలో నిడుకొని తెల్లని పాన్పుపై పవళించియున్నాడు. ఆ విగ్రహాన్ని చూచేటప్పటికి మనరాధ కళ్లు మిరుమిట్లు గొలిపాయి. ఆమెకంటికి శేషశాయిలా కనిపించాడతడు. రాధ రెండడుగులేసి ఇటుఅటు పరికించింది. చూపుమేర దూరంలో ఆమెకెవరూ కనపళ్లేదు. నిశ్శబ్దంగా చెవొగ్గి రెండు నిమిషాలు నిలబడ్డదిరాధ. మనుష్యుల అలికిడి కూడా వినబళ్లేదు.

పాన్పుకి ఎడమప్రక్క నొకమేజాబల్లుంది. దానిమీద ఏవో అనేకపుస్తకా లున్నాయి. గోడలకు గాంధి, రామకృష్ణపరమహంస మొదలగు పటాలు వ్రేలాడుతున్నాయి. ఎలుకను పట్టె పిల్లిలాగ చప్పుడు కాకుండా రాధ మెల్లిగా బల్లను సమీపించింది. అచ్చట ఏదో ఒక అమూల్యవస్తువు చూసింది రాధ. వెంటనే అపరమితానందపడి కళ్ల నద్దుకొంది దాన్ని. దానిమీద వస్తువులన్నీ చప్పుడు కాకుండా క్రింద పెట్టింది. తన సంచిలోంచి ఒక అల్లినగుడ్డ ఒకటి తీసింది రాధ. దాన్ని బల్లమీద పరిచింది. ఆగుడ్డమీద నెమలొకటి అల్లిఉంది. ఒకమూల "రాధ" అని వ్రాసుంది. మళ్లా యథాప్రకారంగా అన్నీ సద్దేసింది రాధ.

మళ్లా యిటుఅటు పరికించింది. మెల్లిగా పాన్పుదగ్గర కొచ్చింది. కాళ్లు గజగజ లాడాయి, ఒళ్లు చెమట్లు కమ్మాయి, నోరు తడారింది పాపం రాధకు. అట్లా చూస్తూ నిలబడ్డది రెండు నిమిషాలు. ఎలాగయితేనేం మనస్సు నిబ్బరం చేసుకొంది రాధ. సంచిలో చెయ్యెట్టింది. చక్కని ఒక మల్లెదండ తీసింది. పాపం, ఆదండ మురళీధరుని మెళ్లో వెయ్యా

లని ఊహ. అట్లాగే పరకాయించి చూచింది అతనికేసి. ముత్యాల్లాం చెమటబిందువులు మోమంతా అలంకరించాయి. ఎట్లాగయితేనేం

దండ మెల్లిగా అతనిమెళ్లో వేసింది రాధ. ఉలిక్కిబడిలేచాడు మురళీధరుడు. కట్టెదుట నున్న విగ్రహాన్ని కాంచాడు. ఒళ్లు గగుర్పొడిచింది. రెండునిముషాలు అట్లాగే విగ్రహంలో చూస్తూ ఊరుకొన్నాడు.

“ఈయెండలో ఎట్లా వచ్చావు? ఎంత సేపయిందినువ్వొచ్చి?” అన్నాడుమురళీధరుడు. రాధకు నోట మాటలేదు. నీరై పోయింది. కాళ్లదిక్కు కళ్లె తలవంచుకొని కాళ్లుక్రింద రాస్తూ నిలబడింది రాధ.

మురళీధరుడు ఇటుఅటు పరికించాడు. రాధ చెయ్యిచ్చుకొని దగ్గరకుతీసుకొన్నాడు. బలవంతంమీద ఎట్లాగో కాళ్లు వెనక వెనక్కు లాక్కొంటూ సమీపించింది రాధ.

“ఏవళ్ల కేవందమో వాళ్లక వుండాలి. చెండ్లు మాలలు ఇవన్నీ, చూసావా, ఆడాళ్ల కందంగాని; మొగాళ్ల కెందుకు?” అంటూ తన మెళ్లోదండ తీసి రాధమెళ్లో బలవంతంగా పడేసాడు మురళీధరుడు. రాధ బిక్కమొగమేసిం

ది. చూస్తూండగా కళ్లమ్మటనీళ్లు తిరిగాయి. నాలుగైదు చినుకులైతే మురళీధరుని బట్ట మీద పడ్డాయి. మురళీధరుని మనోభావం మారిపోయింది. “రాధా! రాధా!” అని రెండు సార్లు గద్గదస్వరంతో పిల్చాడు. రాధ నోట మాట లేదు. వెక్కి-వెక్కి- ఏడవడం మొదలు పెట్టింది. “రాధా ఎందుకే ఏడ్పు” అంటూ తన చెంగుతో కళ్లు తుడిచాడు మురళీధరుడు. రాధ అట్లాగే అధోముఖియై నిలబడిపోయింది.

రాధ గద్గదస్వరముతో "బావా, నేను అనాథ బాలికను" అన్నది.

"రాధా! అలాగయితే నన్ను జీవన్మృతునిగా భావించావా" అన్నాడు దీనంగా.

"బావా, నాన్నగారి అవసానకాలపు మాట మరచితిరా" అన్నది రాధ.

"దేహ పంజరమున ప్రాణవిహంగ ము న్నంతకాలము మురళీధరుడు మరువజాలడు" అన్నాడు గంభీరంగా. రాధ తలెత్తి మురళీధరుని కేసి చూసింది. మురళీధరుడు ఆమెచూపులో తనచూపు ఐక్యం చేశాడు. అట్లా కాసేపు చూచుకొని చిరునవ్వులతో ఇరువురుకూడ సిగ్గున కాబోలు తలలు వంచేశారు. అంత మనస్సులు ఏక మయాయి. తోడనే శ్రీపార్థసారథి వారి కోవెలలో "టంగు టంగు" మని రెండుగంటలు కొట్టారు. అంత ఇంట్లో పిల్లాడు "అమ్మా" అంటూ కూని దీర్ఘంతో లేచాడు.

"మీ అత్తొచ్చింది చూశావా" అంటూ మురళీదరుడు లోపలికెళ్లి "అమ్మా అమ్మా రాధొచ్చిందే" అన్నాడు.

ఉలిక్కిపడి లేచి "ఏది, నాకన్నత ల్లేది" అంటూ హాల్లో కొచ్చింది యిల్లాలు.

పాపం రాధ బిక్కమొగ మేసుకొని వెనక వెనక్కి వెళ్లడం ఆరంభించింది. పరుగు పరుగునొచ్చి కౌగలించుకొని హోరున ఏడుస్తు, "తల్లీ, నీకెక్కడ దాపురించిందే యీమాయ మతం" అంది. కన్నకడుపుకంటె పెంచిన ప్రేమ పెద్దదగదాండి! పాపం, రాధను చూసి ఏడేళ్లయింది.

రాధను లోపలకు తీసి కెళ్లింది. శుభ్రంగా తలంటి నీళ్లోసి అన్నం పెట్టింది ఆయిల్లాలు. కొత్తగుడ్డలు కట్టపెట్టి పైటవేసింది రాధకు. తలంతా తుడిచేసి జడేసేటందుకు హాల్లోకి తీసుకొచ్చింది రాధను. మురళీధరుడు కూని దీర్ఘాలు తీస్తూ కుర్చీలో కూర్చున్నాడు. అట్టా క్రీగంటను చూశాడు రాధను. రాధ ఊరుకొంటుంది కనుకనా? ఒండొరుల చూపులు గ్రహించింది యశోద. రాధకు జడేస్తూ కూర్చుంది. "అమ్మానాకే" అంటూ బల్లమీదున్న దండకేసి చూస్తూ ఏడవడం మొదలుపెట్టాడు తారకం.

"ఏడవక; అది అన్నయ్యది. తీస్తే వదిన కొడుతుంది ఊరుకో" అన్నది యశోద.

"అమ్మా! నాకువదినైతే అన్నయకో."

మళ్లా రాధామురళీధరులు ఒండొరులు చూచుకొని ముసిముసినగవుల పాలయారు.

"అమ్మా చెప్పవే అదిన అన్నయి కేమవుతుందే-ఏ-ఏ-"అని మూల్గారంభించాడు తారకం.

"నేను నాన్న కేమవుతాను" అంది విసుగుతో యశోధ.

అంత బాలుడు నవ్వుతూ "పెళ్రాంవే" అన్నాడు. అంత అందరి మొగాలు ఒక్కపెట్టున వికాసం వహించాయి. రాధామనోహరులు ఒండొరులు ఒక్కసారిచూచుకొన్నారు.

యశోద రాధను తిరిగి పోవలదని బలవంతపెట్టింది. రాధ పోకపోవీల్లేదని చెప్పి, గుడికిపోవు మేకపోతులా పోలేక పోలేక తనఉనికికి పోయింది.

3

మదరాసు ధూమశకటాలయం చూసినవారు పెద్ద దనక మానరు. బళ్లు విసుగు విరామము లేక అన్నివైపులనుంచి వచ్చి పోతూంటాయి. రాత్రి 7-30 అయింది. కలకత్తాబండి క్రిక్కిరిసింది. అంత ఒకదొరగారు “నీవ్వు, రాహేలు ఆడఓరి పెట్టిలో కూరుచుండి” అని ఒకఆమెతో చెబుతూ భార్యాసమేతంగా తాను మధ్యతరగతి పెట్టిలో కూర్చున్నాడు.

రాత్రి 8 గంట లయింది. “ఢాం” అన్న కోటలోని ఫిరంగిచప్పుడు వినబడింది. ‘గుభు గుభు’ అని ఈలేస్తూ పచ్చలాంతరు చూపించాడు శకటరక్షకుడు. అంత ‘కూ’ అని కూత కూసి ‘గుఫ్ గుఫ్’ అనిధూమాన్ని వదలుతూ ‘లటక్-లటక్’ అనే శబ్దంతో బండి కదిలింది.

రాహేలు! మన మేమూరెడుతున్నాం? అంది.కృపావతమ్మ.

“ఏమో నాకు తెలియదండి” అని పెదవి విరిచింది రాహేలు.

“పోనీ, ఎందు కెడుతున్నామో తెలుసునా?” అంది. “ఉహుం” అంటూ తెలియదనే భావం తెలియ జేసింది తలూపుతూ రాహేలు..

“మన మెడుతూన్నది నెల్లూరు, నీపెళ్లి కెడుతున్నాము” అంది కృపావతి.

రాహేలు మోము వెలవెలపోయింది. ఆశ్చర్యంతో నోరావలించింది.

ఆకస్మికంగా మోకాళ్లమీద తలజేర్చి “ఉస్సూ” అని ఒక పెద్దనిట్టూర్పు విడిచింది.

కృపావతమ్మ వాళ్లపంతులమ్మ. సార్థక నామధేయురాలు. “రాహేలు నామనస్సులో నున్నది దాచకనాతో చెప్పు. ప్రస్తుతంలో నీకు నాకంటె సహాయం చేసేవారెవరు లేరు. నీవొకటి మామార్తొకటి కాదు నాకు” అంది దయాపూర్వకంగా కృపావతి.

రాహేలు మాటాడలేదు. “చెప్పవమ్మా మరి నీమనస్సులో నున్నది; నాకేం తెలుస్తుంది? అమ్మయినా అడగందే అన్నమైనా పెట్టదుగదా” అంది కృపావతి.

“నాకు ఈమతమునందు యిష్టము లేదు. ఆర్యమతంలో చేరి మా తల్లిదండ్రుల అభీష్టప్రకారం మాబావను......” అని హోరున యేడుపు మొదలుపెట్టింది. కృపావతమ్మ రాహేలు మనోభావం గ్రహించింది.

“అమ్మా! యధార్థం చెబుతున్నాను. దొరగారు పదిహేనువందల రూపాయలు తీసుకొని నిన్ను నెల్లూరులోనున్న సామ్యూలు కొడుకుమేథ్యూసు కివ్వాలని సంకల్పించుకొన్నాడు. రాహేలు, నీవు ధైర్యంగా మాత్రం ఉండు. ఈవిషయంలో నీకు నేను నాశక్తివంచన లేకుండా సహాయం చేస్తాను.ముల్లుని చూస్తూనే తియ్యాలి సుమా! దొరగారు నిన్నడిగినప్పుడు వ్యతిరేకంగా మాత్రం చెప్పకు. నేనసలు గవళ్లదానను. నాపెనిమిటివల్ల యిందు

లోకి రాక తప్పింది కాదు. నాపేరు అసలు కడలి కాంతమ్మ. నాది గడపారం" అని అంత వృత్తాంతం చెప్పింది కృపావతమ్మ.

బండి నెల్లూరు ఆలయం వచ్చి ఆగింది. దిగేవాళ్లు దిగకుండా యెక్కేవాళ్లు ఎక్కుతున్నారు. దొరగారు "కుపాతి, కుపాతి బండి దిగు" అని కేకలేశారు. అంతా దిగారు. బండి కదిలి వెళ్లిపోయింది. రాహేలు మామగారు సామ్యూలు, నల్లకోటు తొడిగి, జరీబుట్టపాగా పెట్టి, కొరడా చేత్తోపట్టుకొని దొరగారికి వారి సానిగారికి సలాములు చేసి "దయచేయం" డన్నాడు. దొర పత్నీసమేతంబుగా ఆ రెండెడ్లబండి నెక్కెను. రాహేలును, కృపావతిని చోటులేని హేతువుచే బండిదిగి నడిచిరమ్మన్నారు. సామ్యూలు పళ్లుబిగించి బండి తోలడం ప్రారంభించాడు. ఎలాగో యిల్లు చేరారు. ఆ రాత్రి గడిచిపోయింది. తెల్లవారింది. దొరగారికి కాఫీ తయారు చేశారు. బ్రెడ్డుదొరకలేదని మెచ్యూసు మరియు తహ తహ లాడి పోయాడు.

మెచ్యూసు సహజంగా మంచివాడు; దయాపరిపూర్ణ హృదయుడు. బందరు నోబులు కళాశాలలో మధ్యతరగతి చదువుచున్నాడు. దేశంలో జరుగుచున్న సంగతులన్ని తెలిసినవాడు. ఒరులమనస్సు నొప్పించడమే గొప్ప పాప మనేవాడు.

పదిగంటల పొద్దెక్కింది. పిల్లను చూసి మరియ, సామ్యూలు మురిసిపోతున్నారు. చుట్టుప్రక్కలున్న మతంపేరంటాళ్లు, మాల పేరంటాళ్లు వచ్చి చూచి పోతున్నారు. "పాపం బేమ్మడికూతురు మాలాడిపెళ్లాం" అన్నారు కొందరు. "మాతమ్మ! నీ కోడల్ను చూచి నావా" అంది దొరసాని.

"అంతా ఏలోక్కి సలవండి. మాఅబ్బాయంటె దొరోరికి నిండా పేమండి" అంది మార్త. "ఈపిల్ల యిశంలో దొరోరు చాలాలావు కష్టపడ్డారు" అంది దొరసాని.

ఈమాటలన్ని వింది రాహేలు. ఇల్లం తదూరములోఉన్న చింతచెట్టుక్రింద కెళ్లి హోరుహోరున యేడవడం ఆరంభించింది. ఏం వారించేటందుకు కడుపు వాపా!

కృపావతికి మెచ్యూసు సంగతి తెలిసింది గనుక వృత్తాంతమంతా చెప్పేసింది." "పిన్నీ పిల్లను రక్షించే భారం నీది. మానాన్న చేదస్తుడు. నేనే యీపిల్లను వద్దంటే పదిహేను వేల రూపాయలు పెట్టానని నాలిక పెరుక్కొంటాడు. పిల్ల కిష్టం లేందే పిల్లమనస్సు నొప్పించి వివాహం చేసుకోవడం నాసమ్మతి కాదు. నేను యిక రెండేళ్లలో నాన్నగారిని ఒడంబడచి మళ్లా హిందూమతంలోకి వెళ్లిపోతాను. మొన్న దేవేంద్రుడుగారివద్ద వాగ్దత్తం చేశాను" అన్నాడు మెచ్యూసు.

మెచ్యూసు తిన్నగా పిల్లదగ్గర కెళ్లాడు. అశోకవనంలో సీత జ్ఞాపకమొచ్చింది మెచ్యూసుకు. "ఆపద్బాంధవా! అనాథరక్షకా! ద్రౌపదీ మానరక్షక! నీవే దిక్కని నిరతము నమ్మియుంటినోయి! నా మనఃపీఠమున నిన్నే నిరతము సేవించుచుంటినోయి తండ్రీ! నీవే నామొఱల

కఠినతవహించిన నా మేలు గోరు ముగ్గురు నెచ్చెలులు కలరోయి! ఆ! ఎవరనియా? నిప్పున్నది, నీరున్నది, విషమున్నది—తండ్రీ!" అని పెద్దపెట్టున యేడుస్తూన్నది రాహేలు.

మెచ్యూసు కడుపు చెరువై పోయింది. నోట మాట రాలేదు. ఎట్టకేలకు "అమ్మా!

ఏల విచారించెదవు" అని మెచ్యూసు సంబోధించాడు. అమ్మా, అన్న అక్షరద్వయము చాలా పవిత్రమైంది.

"నేను కృపావతివల్ల మీ మనోభీష్టము తెలుసుకొన్నాను. మిమ్ములన్ని విధములకృపావతి కాపాడును. మీరు విచారించ పనిలేదు. కొలదికాలములో మీఅభీష్టము నెరవేరును." అని దయాపూర్వకంగా ఊరడించాడు మేచ్యూసు.

అంతరాహేలుకు ధైర్యం వచ్చింది. వినయ పూర్వకంగా నిలబడి "తండ్రీ, నమస్కారములు. తమవంటి పూజ్యు లుండుటచేతనే ప్రపంచక మిటులైన నున్నది. మీరు బ్రాహ్మణులనిన అతిశయోక్తి కానేరదు. పుట్టుకచే గాక బుద్ధిచే మానవుడు బ్రాహ్మణు డగును. మీవంటి పరమపురుషులను భర్తగా స్వీకరించుట నాకును సమ్మతమేకాని నామనస్సు అన్యాయత్వము కావించినదానను. క్షమించ ప్రార్థించుచున్నాను" అని వినయ పూర్వకంగాంది రాహేలు.

"విచారించనలదు. కృపావతి మిమ్ముల రక్షించును." అని చెప్పి మేచ్యూసు వెళ్లిపోయాడు.

రాత్రయింది. మరునటిదినము ఉదయముననే వివాహము. సామ్యూయాలు, మరియ కాళ్లు చేతులు విరక్కొట్టుకొని వాళ్ల జమ్ముటిల్లంతా అలంకరించారు. చుట్టుప్రక్కల మతం పుచ్చుకొన్న బుద్ధిమంతులంతా వచ్చారు. ఇల్లంతా కోలాహలంగా ఉంది. రాత్రి 11 గంటలైంది. నిద్రాదేవత అందర్ని ఆవరించింది. కృపావతికిమాత్రం కాలం గడచినకొలది ఆవేశం హెచ్చవుతోంది.

మెల్లిగా రాహేలును వెంటబెట్టుకొని ధూమశకటాలయానికి వెళ్లింది కృపావతి. తండ్రి అవసానకాలంలో ఇచ్చిన 36 రూపాయలు 9 అణాలు 6 పైసలు రాహేలు సంపత్తి దగ్గరున్నది. కృపావతమ్మ తనవద్దనున్న పదకొండు రూపాయలు కూడా యిచ్చి "రాహేలు, మనిద్దరకు యీడబ్బు చాలదు. కాబట్టి నీవు యీ పైకంతో ప్రస్తుతం కాశీకెళ్లు. ఈ ఆపద తప్పుతుంది. తరువాత దైవమున్నాడు. ఆల

స్యం చెయ్యరు. అదిగో బండొస్తోంది. నే టికెట్టు తీసుకొస్తాను" అని కలకత్తాకు టికెట్టు తీసుకొచ్చింది కృపావతమ్మ.

బండొచ్చి యధాస్థానములో ఆగింది. రాహేలును బండెక్కించి కదిలేదాకా సువార్తలు చెపుతూ దగ్గర కూర్చుంది కృపావతమ్మ. ఇంతలో ఈల వినపడింది. కృపావతి "జాగ్రత్తమ్మా" అంటూ దిగలేక దిగలేక బండి దిగింది. రాహేలుకు దుఃఖ మాగలేదు. "తల్లీ, నమస్కారము" అంటూ గవాక్షం వద్ద కొచ్చింది రాహేలు. బండికదలింది. ఇరువురు ఒకరినొకరు చూస్తూ నిలబడిపోయారు.

కృపావతికి ఎట్లాగా యింటికెళ్లడ మని బెంగ కలిగింది. 'తెల్లారాక పిల్లయేదంటే యేమనాలా?' అని ప్రశ్నించుకొంది. 'నాకేం తెలుసు అందామాంటే నీదగ్గర పడుకున్న పిల్ల నీకు తెలియక ఎవరికి తెలుస్తుం దంటాడు దొర. పాపం ఎప్పుడు అబద్ధమాడి ఎరుగదు కృపావతి.

ఇలా తర్కవితర్కాలు చేసుకొంటూ ఎక్కడ్కి వెడుతోందో కూడా తనకే తెలియకుండా వెడుతోంది కృపావతమ్మ. త్రోవలో ఒకగాడి నుయ్యిదగ్గర ఒకపెద్దబండఉంటే దాని మీద కూర్చొని యీక్రిందివిధంగా ఆలోచించింది: "నేను నావిధికృత్యాన్ని నెరవేర్చాను, ధన్యురాలను. ఇకను నేనింటి కెడితే ఊరుకొనే వాడు కాదు దొర. గుండెల్లేవు; ఎంతపనైనా చేస్తాడు. నేనా అబద్ధానికి అలవాటుపడిన దానను కాను. అబద్ధ మాడుదామని వెడితినా నోరు తడబడుతుంది. కాళ్లు చేతులు ఒణుకుతాయి. ఒళ్లో, చెమట్లు కమ్ముతాయి. చచ్చే అవస్థ పడుతుంది. కంగారుపడి నిజమే చెప్పేస్తాను. లేకపోతే యెక్కడికైనా పారిపోదామాంటే-నన్నెరుగని క్రైస్తవులు లేరు. నిలకడమీద జాడ తెలియక మానదు. ఇకను అనిత్యమై అనిర్మలమైన యీదేహంచేత నిత్యమై నిర్మలమైన యశస్సు సంపాదించాను. అదే నాకు పదివేలు. 'జాతస్య మరణం ధ్రువమ్.' ఎప్పటికైనా చావవలసిన వాళ్లమే. ఇక నాకు యీతను వున్నా వొకటే, లేకపోయినా ఒకటే," అని అంటూ, "కృష్ణా, ఆపద్బాం

ధవా" అని అప్రయత్నంగా గుభాలుమని నూతులో ఉరికింది కృపావతమ్మ.

౪

బెజవాడలో గూడూరివారు గొప్పకుటుంబికులు; ఆపదలకు అడ్డుపడేవారు. వాళ్ల బామ్మ కాశీవెళ్లి తిరిగొచ్చింది. వచ్చేటప్పుడు

దిక్కులేని ఒకపిల్లను తీసుకొచ్చింది. ఆపిల్ల రక్తవిహీనమై వెండిబొమ్మలాగుంది; లేవ సత్తువలేదు. వాళ్లవాళ్లంతాపిల్లను చూచి చాలా కనికరించారు. ఆసాయంత్రమే వారింటివైద్యులైన డాక్టరు యమ్. ఆర్. ధర్‌గారిని పిలిపించి చూపించారు. డాక్టరుగారు చాలా ఉదారస్వభావులు; దీనులపాలిటి కల్పవృక్షం. పిల్ల జీవించుట కష్టమని ఆయనకుకూడా అధైర్యం తోచింది.

"రేపుదయాన్నే మా హాస్పిటలునకు తీసుకు రండి. రోగిని గంటగంటకు చూస్తూండాలి. రోగం చాలా దుర్భరమైంది. రాత్రి గంటగంటకు పాలిస్తూండండి" అని చెప్పి వెళ్లిపోయాడు డాక్టరు.

చెప్పినచొప్పున పిల్లను 'రాధామెడికల్ హాలు'కు తీసుకొనివెళ్లారు. అంత డాక్టరుగారు దాయి నొకదాన్ని పిలిచి "పడక" ఒకటి ఖాళీచేసి స్నానం చేయించి పడుకోపెట్టండన్నారు. పిల్లకు జ్వరంమాత్రం అధికంగానే యుంది. ఇంత జ్వరంలో నున్న పిల్ల ఆమూల్యం ఏముందో కాని, ఒక చిన్న తాటాకుల పెట్టె మాత్రం వదలింది కాదు.

రోగు లందరకు యథాప్రకారం మందు లిచ్చి 12 గంటలయేటప్పటికి ఈ రోగిదగ్గర కొచ్చాడు డాక్టరు. ఆమె హృదయం పరీక్ష చేసి నాలుకచూచి తలఊచి గంట గంటకు నిద్రపోతూన్నను లేపి పాలు పట్టవలసిం దని దాయితోచెప్పి తా నింటికి పోయాడు. పరిపరి విధా లాలోచించాడు డాక్టరు. కాని రోగం మాత్రం బోధపడలేదు.

రాత్రి షుమారు తొమ్మిదిగంట లైంది. రోగి ఏ అవస్థలో ఉన్నదో చూదామని డాక్టరు లాంతరువేసుకొచ్చాడు. దాది ఒకమూల గుర్రట్టి నిద్దరోతోంది. రోగి ఈక్రింద విధముగా పలవిస్తోంది:—

"మురళీధరా; నన్ను మోసగించితివా? ఆనాటి నాన్నగారి అవసానకాలపు మాట మరచితివా? మురళీధరా—రాధ మరణించినదని వివాహమాడితివా? ముర-ళీ-ధరా— ఇహంబున నీవును, పరంబున దైవము తప్ప నా కన్యులు లేరోయి! ఆ! అదుగో మురళీధరుడు; నానాథుడు! రండి దయచేయండి-నన్ను స్వీకరించండి. నాతో దాగుడుమూతలా-నే చూశాలెండి. నేనే వస్తున్నా" అంటూ లేవబోయింది.

డాక్టరంతా విన్నాడు. నిశ్చేష్టితుడై నిలువునా నీరై పోయాడు. రోగిని గట్టిగా పట్టుకొని లేవవద్దనిచెప్పి దాయిని కేకేసాడు. ఉలిక్కిపడిలేచి పరుగెత్తుకొచ్చింది దాయి. రాత్రి జాగరూకతతో కాపాడవలసిందని చెప్పి కిందున్న తాటాకుపెట్టె తీసుకొని యింటి కెళ్లాడు డాక్టరు.

డాక్టరు మనస్సులో సంతోషము, దుఃఖము ఒక్కసారి ఉద్భవించాయి. నీరసంగా తన వాలుకుర్చీలో వాలిపోయాడు. లాంతరు పెద్దది చేశాడు. ఆపెట్టెలో ఏముందో అని ఆత్రముతో, తీసాడు. అందులో రెండు ఛాయాపటాలున్నాయి. ఒక వుత్తరం అంటించుంది. దానిమీద విలాసం ఇట్లా వుంది.

మ. రా. శ్రీ—

డాక్టరు మురళీధర్రావు గారికి,
నర్సాపురం; పశ్చిమ గోదావరిజిల్లా.

ఆ ఛాయాపటాల్లో ఒకటి స్త్రీది. ఒకటి పురుషుడిది. ఆపురుషుడిపటానికి పసుపురా సుంది. అచ్చటచ్చట నిత్యం పూజ చేస్తూన్నట్లు పువ్వు లగపడుతున్నాయి. మెల్లిగా ఉత్తరం విప్పాడు డాక్టరు. అందులో యీ క్రిందవిధం గా ఉంది:—

కాశి,
3-4-1925

పూజ్యులగు మురళీధర బావగారికి,

నమస్కారములు.

అయ్యా,

ఈలేఖా పూర్వకంబుగ తమకు దుఃఖము కలుగచేసినందులకు క్షమింప ప్రార్థితులు. నామ రోనిశ్చయము తమకు తెలిపినగాని నాకు ఆత్మ శాంతి లేదు. ఆహేతువుచే నే నిశ్చింతతో మరణించ నేరను.

నేను తమవద్దను, అత్తగారివద్దను సెలవు తీసుకొనిన మాసమునకే నావివాహము తల పెట్టిరి. కృపావతితల్లి కృపచే నే నాకష్టసము ద్రమును దాటి కాశీ చేరగలిగితిని. ఇచ్చట శ్రీశంకరస్వాముల అనుమతిని ప్రాయశ్చిత్తము బొందితిని.

నే జీవింతునని ఆశలేక నే నీలేఖ వ్రాయ పూనుకొంటిని. నామరణానంతరము గాని యిది తమకు చేర నేరదు. మీరు యిప్పటివర కును నామీద ప్రేమచే అవివాహితులుగ నుండెదరని నమ్ముచున్నాను. నే నట్టినోమును నోచుకొన లేదు. మిమ్ములనెవ్వరినైనను వివా హము చేసికోవలసినదని కోరుటయే ఈలేఖ యొక్క ముఖ్యోద్దేశము. మీరు నామీద ప్రేమ గలిగినచో అనాథబాలికల రక్షించ కంకణము కట్ట ప్రార్థించుచున్నాను.

నావిషయమై విచారించవలదు. దైవము తమకు అనతికాలములో పుత్రపౌత్రుల ప్రసా దించుగాక.

ఇట్లు
భవదీయ శ్రేయాభిలాషిణి
చరణదాసి,
రాధ.

“డాక్టరు ఆలేఖను మరలమరల చదువ దొడగెను. కన్నీరు బొటబొటమని రాల జొచ్చె. యథాప్రకారముగ లేఖను భద్రప రచెను.

దీపమును సన్నముచేసి డక్టరు మంచ ముమీద వ్రాలెను; నిద్దురపట్టదు. పిచ్చివాని వలె తనలో తాను వాదప్రతివాదములు చేసి కొనుచుండెను. తెల్లవారవచ్చినది. “కొక్కొ రో కో” అని కోడి కూసింది.

అంత డాక్టరు ఆపెట్టెను తీసుకొని ఆసు పత్రి కెళ్లాడు. రోగి యీ క్రిందవిధంగా ఒక పిచ్చిపాట పాడుతోంది.

బ్రతికి యున్నానోయి మురళీధర,
ఎందు వెతకిన గాని మురళీధర నీవు-
కానరా వేమోయి మురళీధర
నిన్ను- ఏమనందునోయి మురళీధర
నన్ను- మోసగించితివోయి మురళీధర
నీవె- దిక్కనిఓయి మురళీధర
నేను- నమ్మియుంటినోయి మురళీధర
వాపోవుచున్నాను మురళీధర

రాళ్లు కరుగుతవోయి మురళీధర
వెన్న రా యయిందోయి మురళీధర
జాగు సేయక నన్ను మురళీధర
వచ్చి రక్షించవోయి మురళీధర

అని పాడుతూ హోరున ఏడవడం మొదలు పెట్టింది. డాక్టరుకు కూడా అప్రయత్నంగా కన్నీళ్లు కారాయి. వెంటనే ఒకబండిమీద వేసి రోగిని తన యింటికి తీసికెళ్లాడు డాక్టరు.

రోగికి ఆనాడే తనచేత్తో కాఫీ యిచ్చాడు. తాగుతూ రోగి డాక్టరుకేసి తేరిపారచూసింది. డాక్టరు చూశాడు. దానితోనే రోగి మొఖానికి కళొచ్చింది. రోగికి డాక్టరే స్వంతంగా అన్ని ఉపచారాలు చేస్తూ ఉండేవాడు. రోజురోజుకు ఆరోగ్యం కలుగుతోంది రోగికి.

రోగి మధ్యమధ్య "డాక్టరుగారు! ఎలాగండి మీఋణం తీర్చుకోడం" అనేది.

నవ్వుతూ డాక్టరు "నీవు బాగా ఆరోగ్యంగా ఉంటే నా ఋణం తీర్చుకోగలవనే ధైర్యం నాకుందిలే" అనేవాడు.

రోగి కొన్నాళ్లకు ఆరోగ్యవతైంది. మదరాసు లేతతమలపాకులా నవనవలాడుతూంది. నవ్వితే బుగ్గలు చొట్టపడుతున్నాయి. ఉంగరాలు ఉంగరాల్లా ముంగురులు ముందుకు పడుతున్నాయి. నన్నే చూడమంటూంది రాధ.

యధాప్రకారంగా ఒకరోజు సాయంకాలం రాధ "డాక్టరుగారు, మీఋణంఎట్లాగండి తీర్చుకోవడం" అంది.

"లేంది యిమ్మంటాను గనుకనా; యేదో నీదగ్గరున్నదాంతోనే తీర్చుకో" అన్నాడు చిరునవ్వునవ్వుతూ డాక్టరు.

"డాక్టరుగారు నాదని చెప్పేది నా దగ్గర ఏమీ లేదండి. మళ్లా జన్మలో తీర్చుకోవాలండి" అంది తీక్ష్ణభావంతో రాధ.

గూడూరి వారితో ఈ వృత్తాంతం చెప్పాడు డాక్టరు. వాళ్లు డాక్టరు మిత్రుడే కాకుండా వాళ్లింటల్లుడయ్యాడని ఆబాలగోపాలం అపరమితానంద పడ్డారు.

ఆనాడు పూర్ణిమాచంద్రుడు పట్టశక్యం కాకుండా ఉన్నాడు. రాధ దొడ్లో మాలతి క్రిందచపటామీదకూర్చుంది. డాక్టరుఅప్పుడే భోంచేసి దొడ్లో కొచ్చాడు. ఇటుఅటు పచార్లు చేస్తూ డాక్టరన్నాడుగదా "రాధా నాఋణం మాటేం చెప్పావు"?

"దానివిషయంలో నే ఆలోచిస్తున్నానండి. ఇహంలో తీర్చుకో నేభాగ్యం పట్టలేదండి" అంది రాధ.

"రాధా, నీవు అవివాహితవు కావా" అన్నాడు డాక్టరు.

"లోకానికి అట్లాగే తోస్తుందండి. నా ఆత్మ అన్యాయత్త మైపోయిందండి. ఆత్మేనా వివాహ మైందన్నమాటేనండి" అంది రాధ.

"నీమనోవిభుడు నాకు తెలియ కూడదా?" అన్నాడు డాక్టరు. "ప్రాణదాతలు మీ దగ్గర మరుగేమిటండి?" అంటూ ముసిముసి నవ్వులు నవ్వుతూ "మురళీధరులు" అంది రాధ.

"ఆయన్ను నే నెరుగుదును. ఆయనకు వివాహ మయింది. ఇప్పుడు నాఋణం తీర్చే

టందుకు నీకభ్యంతర ముందా?" అన్నాడు డాక్టరు.

అంత రాధ మోము తెల్లబారింది. క్రోధంతో "చితితోగాని చిత్తం మార్పుకలుగ దండి; వివాహమైనా ఆయన హితం కూరుస్తూంటానండి" అంది రాధ.

"ఆయనభార్య నన్ను చేరనియ్యకపోతే ఏపుణ్యక్షేత్రానికో పోయి యిహాన్ని విడచి మళ్లాజన్మంలో మీరుభర్తలు కావాలని దైవాన్ని ప్రార్థిస్తాను." అంది దీనంగా రాధ. "బలవంతాన్ని నిన్ను నే యిప్పుడు చెరబడితే యేం చేస్తావు?" అన్నాడు నవ్వుతూ డాక్టరు. "వెలుగే చేను మేస్తే కాసేవా రెవరండి?" అంది రాధ కోపంతో.

"చూడు" అంటూ చేరబోయాడు డాక్టరు.

"క్రూరా! స్త్రీమాన-చోర!" అంటూ తోటలోని బావివైపు పరుగెత్తింది రాధ.

"నీవు కానుకగ నిచ్చిన లే సిదిగో! యశోదత్త లోనున్నది" అంటూ వెంటాడించాడు మురళీధరుడు.

"రాధా! తొందరపడకు. నేనే మురళీధరుడను. మీ తండ్రికోర్కె ప్రకారము అవివాహితుడను. నీవు కానుకగ నిచ్చిన లే సిదిగో! యశోదత్త లో నున్నది!" అంటూ వెంటాడించాడు మురళీధరుడు.

రాధ మూర్ఛచే వాలిపోయింది. అంత మురళీధరుడు తన కౌగిలి పట్టాడు.

ఈసంగతి గూడూరివారికి తెలిసింది. వీథులు దడికట్టి పెళ్లిమంటూ పెళ్లి చేసారు.